క్లుప్తంగా

మొవ్వ ఎంఈఓ-1గా భానుప్రకాష్



మొవ్వ: మొవ్వ మండల విద్యాశాఖ అధికారి-1గా అమ్ముల భాను ప్రకాష్ (పూర్తి అదనపు బాధ్యతలు) శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న భాను ప్రకాష్ సర్దుబాటు చర్యలో భాగంగా ఎంఈఓ-1గా మొవ్వ మండలానికి విచ్చేశారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మోత్సవాలు



గుడివాడ టౌన్: స్థానిక మార్కెట్ సెంటర్‌లోని శ్రీ అష్టలక్ష్మి గోసహిత వేణుగోపాల స్వామి దేవస్థానంలో శ్రీకృష్ణాష్టమి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో సుదర్శన హోమం, మహాలక్ష్మి హోమం జరిపారు. ఈనెల 8 నుంచి 23వ తేదీ వరకు ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు సూర్యపవన్ శర్మ తెలిపారు. శనివారం ఆలయ ప్రాంగణంలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత



గుడ్లవల్లేరు: పేద విద్యార్థులకు చేయూతను అందించిన దాతలను ఎంఈఓ జి.గోపాలరావు శుక్రవారం ఘనంగా సన్మానించారు. మండలంలోని కూరాడ పాత దళితవాడలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బల్లలను అందించారు. కారె నాగేశ్వరరావు స్మారకార్థం ఆయన కుమారులు, ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు కారె వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, పోతురాజు ఈ బల్లలను అందజేశారని ఎంఈఓ తెలిపారు. హెచ్ఎం వి.లక్ష్మీకుమారి, చైర్మన్ పద్మావతి పాల్గొన్నారు.

వినాయకచవితి రాతా ఏర్పాటు



గుడివాడ టౌన్: స్థానిక 7వ వార్డులోని పుల్లల పాడు వంతెన వద్ద గల శ్రీ కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ సమేత శ్రీ బాలగణపతి స్వామి ఆలయంలో వినాయక చవితి రాతా శుక్రవారం ఏర్పాటు చేశారు. గణపతి నవరాత్రి మహోత్సవాల ఏర్పాట్లు ప్రారంభం సూచికగా ఈ రాతా ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 27వ తేదీ నుంచి సెప్టెంబర్ 6వ తేదీ వరకు స్వామి వారి నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సచివాలయ ఉద్యోగులకు ఉత్తమ పురస్కారాలు



గుడ్లవల్లేరు: విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన గుడ్లవల్లేరు మండలంలోని గ్రామ కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులకు మండల స్థాయి ఉత్తమ పురస్కారాలను గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం అందుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొడాలి సురేష్, ఎంపీడీఓ ఎంపీ ఇమ్రాన్, డెప్యూటీ ఎంపీడీఓ అంజనాదేవి, పంచాయతీరాజ్ ఏఈ నాగేశ్వరరావు, ఎంఈఓ జి.గోపాలరావు, గ్రామ కార్యదర్శి ఏజేఎల్ నరసింహారావు అభినందించారు.

అమర వీరుల త్యాగ ఫలితమే స్వాతంత్య్రం

గుడివాడరూరల్: దేశ స్వాతంత్య్రం కోసం అమరు వీరుల త్యాగాలను జాతి ఉన్నంత వరకు గుర్తించుకోవాలని ఎంపీపీ గద్దే పుష్పరాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద స్వాతంత్య్ర దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి ఎంపీపీ జాతీయ జెండాను ఆవిష్కరించి మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ, ఎంపీడీఓ బివై విష్ణుప్రసాద్, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు. గుడివాడ ఎక్సైజ్ కార్యాలయం సీఐ పి.వెంకటరమణ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను నిర్వహించి జెండా వందనం చేశారు. గుడివాడ పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయం వద్ద డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు.

పమిడిముక్కలలో.

పమిడిముక్కల: పమిడిముక్కల సర్కిల్ కార్యాలయంలో సీఐ చిట్టిబాబు, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శ్రీను, వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏఓ గణేష్‌రెడ్డి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నవీన్‌కుమార్, పమిడిముక్కల హైస్కూల్లో హెచ్ఎం దుర్గాభవాని, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కాసాని వేద సుప్రజ జాతీయ జెండాలను ఎగురవేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మువ్వన్నెల జెండా రెపరెపలు

మండవల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం జాతీయ జెండాలను ఎగురవేశారు. గాంధీ సేవాశ్రమం, మండవల్లి హైస్కూల్, పంచాయతీ కార్యాలయం, పీహెచ్‌సీ, రెవెన్యూ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం తదితర కార్యాలయాల్లో జెండాలను ఎగురవేసి ఘనంగా వందన సమర్పణ చేశారు. గాంధీ సేవాశ్రమంలో ఎండోమెంట్ ఈఓ కె.దివ్యశ్రీ జెండా ఎగుర వేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గా ప్రసాద్ (రాము) సర్పంచ్ మెండా ఝాన్సీ, జెడ్పీటీసీ ముంగర విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: పేదలు అభ్యున్నతి చెందాలంటే అక్షరాస్యతతోనే సాధ్యమవుతుందని, దీనికి ఆ జాతిపిత మార్గం చూపారని ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ బందారు శ్యామ్‌కుమార్ అన్నారు. స్థానిక శ్రీ సాయి విద్యానికేతన్ అధినేత శింగంశెట్టి ఆదినారాయణ(చిన మాస్టారు) ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. స్థానిక ఏఏఎస్ఎం అండ్ వీవీఆర్ ఎస్ఆర్ హైస్కూల్లో డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కొడాలి సురేష్ చేతుల మీదుగా జాతీయ జెండా ఎగురవేశారు. తహసీల్దార్, గుడ్లవల్లేరు పంచాయితీ కార్యాలయాల్లో జెండావిష్కరణలు చేశారు. తహసీల్దార్ బి.లోకరాజు, ఎంపీడీఓ ఇమ్రాన్ పాల్గొన్నారు.



కైకలూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవంలో పాల్గొన్న డీఎన్నార్

గుడివాడలో..

గుడివాడ టౌన్: స్థానిక ఏలూరు రోడ్డులోని కోర్టు ప్రాంగణంలో 11వ అదనపు జిల్లా జడ్జి జి.సుబ్రహ్మణ్యం జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి యస్.వాసుదేవ్, జూనియర్ సివిల్ జడ్జి పి. గాయత్రి, మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి డి.అరుందతి, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

- స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ జి. బాల సుబ్రహ్మణ్యం జాతీయ జెండాను ఎగురవేసి పతాక వందనం చేశారు.
- స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.
- స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కె. రంగప్రసాద్ పాల్గొన్నారు.
- స్థానిక గౌతమ్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో ప్రిన్సిపాల్స్ ఎం.సత్యారామ్, పి. లక్ష్మీప్రసాద్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. స్కూల్ ప్రాంగణంలోని గాంధి విగ్రహానికి నివాళులర్పించారు. కార్యాక్రమంలో ప్రిన్సిపాల్స్ కె. జ్యోతి, ఆర్. ప్రశాంతి పాల్గొన్నారు.



గుడివాడలో జెండా వందనం చేస్తున్న న్యాయమూర్తి సుబ్రహ్మణ్యం



గుడివాడలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గౌతమ్ హైస్కూల్ ప్రిన్సిపాల్స్

కోర్టు ఆవరణలో..

కైకలూరు: స్వాతంత్య్ర దినోత్సవం నియోజకవర్గంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కైకలూరు కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి జాతీయ జెండను ఆవిష్కరించారు. జూనియర్ సివిల్ జడ్జి ఎం.శివకిరణ్‌తో కలసి స్వాతంత్య్ర దినోత్సవ విశిష్టతను తెలిపారు. అదేవిధంగా బార్ అసోషియేషన్ తరపున అధ్యక్షుడు గురజాడ ఉదయశంకర్ జెండాను ఎగురవేశారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ వరహాపట్నం, భుజబలపట్నం పాఠశాలలు, ట్రావెలర్స్ బంగ్లా, ఎంపీడీఓ కార్యాలయం, ప్రభుత్వాసుపత్రి, పెద్ద మసీదు, గాంధీబొమ్మ సెంటర్, పంచాయతీ కార్యాలయం, ఏఎంసీలో జాతీయ జెండాను శుక్రవారం ఆవిష్కరించారు. ఎంపీడీవో కార్యాలయంవద్ద ప్రత్యేక అవసరాలు కలిగిన బాలబాలికలకు చైర్స్, వినికిడి యంత్రాలు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, సర్పంచ్ కేవీఎస్ఎం.నాయుడు పాల్గొన్నారు.

నందివాడలో..

నందివాడ: మండల ప్రజా పరిషత్ ఆఫీస్‌లో స్వాతంత్య్ర దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వాహించారు. గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ పెయ్యల ఆదాం, ఎంపీడీఓ పి. మల్లీశ్వరి, వైస్ ఎంపీపీ పూడిక సుధాకర్, విద్యార్థులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పామర్రులో..

పామర్రు(మొవ్వ): పామర్రులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. పామర్రు మాజీ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ సూచనల మేరకు పార్టీ కార్యాలయం వద్ద మువ్వన్నెల జెండాను పార్టీ నాయకులు ఎగుర వేశారు. కార్యక్రమంలో పార్టీ రూరల్ మండలాధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు, టౌన్ అధ్యక్షులు నందిపాటి సురేష్‌రెడ్డి, జెడ్పీటీసీ కూనపురెడ్డి స్వరూపారాణి, ఎంపీపీ అశోక్ కుమార్, వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, రమాదేవి, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు తాడిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మొవ్వలో..

మొవ్వ: మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాక రూపశిల్పి పింగళివెంకయ్య జన్మస్థలమైన భట్లపెనుమర్రులో గ్రామ సర్పంచ్ మట్టా ఇందిర, తహసీల్దార్ మస్తాన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. తొలుత గ్రామంలోని పింగళి విగ్రహానికి నివాళులర్పించారు. మొవ్వ ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర జాతీయ జెండాను ఎగరవేశారు. జెడ్పీటీసీ, కో ఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధరాజు, మండల కోఆప్షన్ సభ్యులు అప్పికట్ల ఇమానియేలు మండల అధికారులు పాల్గొన్నారు.

పెదపారుపూడిలో..

పెదపారుపూడి: స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయంలో స్వాతంత్య్ర దినోత్సవ సందర్భంగా తహసీల్దార్ ఎం. శ్రీనునాయక్ శుక్రవారం జాతీయ జెండాను ఎగుర వేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డి జాతీయ జెండాను ఎగుర వేశారు. అన్ని పంచాయతీ, ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగుర వేశారు.

సమరయోధుల త్యాగాలు చిరస్మరణీయం

కైకలూరు: స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కైకలూరు పార్టీ కార్యాలయంలో స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గాంధీజీ, బీఆర్.అంబేడ్కర్ ఆశయాలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. కలిదిండి మండల పరిషత్ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ ఎంపీపీ చందన ఉమా మహేశ్వరరావు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ ఇంటలెక్చువల్ (మేధావుల) ఫోరం రాష్ట్ర కార్యదర్శి బుసనబోయిన వెంకటేశ్వరరావు (బీవీ రావు), మండల పార్టీ అధ్యక్షుడు సింగంశెట్టి రాము, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



కలిదిండి ఎంపీపీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ ఉమామహేశ్వరరావు



కైకలూరు కోర్టు వద్ద వేడుకలో జడ్జీలు వీవీఎస్‌వీ లక్ష్మి, ఎం.శివకిరణ్ తదితరులు



పమిడిముక్కల వేడుకల్లో పాల్గొన్న ఎంపీపీ సుప్రజ



నందివాడలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు



పామర్రులో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పెదపారుపూడిలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న తహసీల్దార్ శ్రీనునాయక్



మొవ్వ ఎంపీడీఓ కార్యాలయం వద్ద జెండా వందనం

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న రమణ

కైకలూరు: కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ బిల్డింగ్ అండ్ అండర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ అన్నారు. భవన నిర్మాణ కార్మిక మండల కమిటీ సమావేశం బైపాస్ రోడ్డు కార్యాలయంలో నాగిరెడ్డి కొండలరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మాట తప్పిందన్నారు. నాయకులు కన్న సాంబశివరావు, కర్ణ శ్రీనివాసు, అంకం త్రిమూర్తులు, పట్టపు అయ్యప్ప, దొండపాటి రాంబాబు పాల్గొన్నారు.

సచివాలయానికి కూలర్ బహూకరణ



నందివాడ: మండలం లక్ష్మీనరసింహపురంలోని సచివాలయానికి వస్తున్న ప్రజల ఇబ్బందిని తెలుసుకుని ఆ గ్రామానికి చెందిన సోషల్ వర్కర్ సామాజికవేత్త ఎండ వెంకటేశ్వరరావు, తన సొంత నిధులు రూ.10 వేల విలువైన వాటర్ కూలర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో సచివాలయ సెక్రెటరీ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

అలీనఖీపాలెంలో కర్బలా అమరవీరుల అరబైయిన్



పమిడిముక్కల: కర్బలా అమరవీరుల అరబైయిన్(40 రోజుల దినం) సందర్భంగా అలీనఖీ పాలెం గదీర్ సొసైటీ ఆధ్వర్యంలో పీర్లను ఊరేగించి, చెస్టబీటింగ్ చేశారు. మత గురువు మౌలానా ఆసిఫ్ అలీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ షాజవాద్ అలీ, అధ్యక్షుడు ఖాసింఅలీ పాల్గొన్నారు.

ఆలయాలు కిటకిట



పూలతో అలంకరించిన శ్రీ విజయదుర్గ అమ్మవారు



వేమవరంలో సామూహిక వ్రతాల్లో భారీగా హాజరైన మహిళా భక్తులు



దోకిపర్రులో అమ్మవారికి పూజా సామగ్రిని సమర్పించిన సుధారెడ్డి తదితరులు

కూచిపూడి(మొవ్వ): శ్రావణమాసంలో నాలు గో శుక్రవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు ఇళ్ల వద్ద వరలక్ష్మి వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. కూచిపూడి శ్రీ గంగా బాలా త్రిపుర సుందర రామలింగేశ్వర స్వామి ఆలయం కూచిపూడి, పెదపూడి గ్రామానికి చెందిన మహిళలు సామూహిక లలిత పారాయణ నిర్వహించి తొమ్మిది రకాల ప్రసాదాలు వితరణ చేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మి దేవిగా దర్శనమిచ్చిన బాలా త్రిపుర సుందరికి అర్చకులు కుంకుమ పూజ చేశారు.

అమ్మవారికి పుష్పాలంకరణ

గుడివాడ టౌన్: స్థానిక నీలామహల్ రోడ్డులోని శ్రీ విజయదుర్గ అమ్మవారి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించి భక్తుల దర్శనానికి ఉంచారు. వేకువ జామునుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నట్లు ఆలయ అర్చకులు పునీత్‌శర్మ తెలిపారు.

మకర తోరణానికి కిలో వెండి అందజేత

పామర్రు(మొవ్వ): శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి శుక్రవారం లక్ష కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొవ్వ మండలం నిడుమోలు వాస్తవ్యులు ఎండూరి శ్రీనివాసరావు, లలితాకుమారి దంపతులు అమ్మవారి మకర తోరణానికి కిలో వెండి అందజేశారు.

కైకలూరులో..

కైకలూరు: శ్రావణమాసం సందర్భంగా నియోజకవర్గంలో పలు అమ్మవార్ల ఆలయాల్లో శుక్రవారం పూజలు నిర్వహించారు. ఉదయం, రాత్రి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కైకలూరు శ్యామలాంబ దేవస్థానంలో అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి పూల అలంకరణ మచిలీపట్నానికి చెందిన శ్యామలా గోల్డ్ కవరింగ్ వర్క్స్ యజమానులు చేయించారు. ఉచిత ప్రసాద వితరణకు దాతలుగా వరద వెంకట శివరామకృష్ణ కిషోర్, చాపరాల భానుభాస్కర్, అడ్డగర్ల సత్యనారాయణ తదితరులు వ్యవహరించారు.

భారీగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

గుడ్లవల్లేరు : వేమవరం శ్రీ కొండలమ్మ ఆలయ ప్రాంగణంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో భారీగా మహిళా భక్తులు పాల్గొన్నారు. శుక్రవారం నిర్వహించిన ఈ వ్రతాల్లో పాల్గొన్న మహిళా భక్తులకు పూజకు అవసరమైన అమ్మవారి ఫొటో పూజా సామాన్లను ఆలయ ఈఓ ఆకుల కొండలరావు అందజేశారు. అలాగే గుడ్లవల్లేరు శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను అర్చకుడు డాక్టర్ అగ్నిహోత్రం ఫణిగోపాల్ నిర్వహించారు. ఆలయ చైర్మన్ వల్లభనేని సీతారాం, పోలవరపు సీతారామయ్య పాల్గొన్నారు.

దోకిపర్రు వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

గుడ్లవల్లేరు: మండలంలోని దోకిపర్రు భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం రాత్రి సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. తొలుత వరలక్ష్మీ దేవికి స్వామివారి దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు, మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను చేశారు. మహిళా భక్తులకు అవసరమైన పూజా ద్రవ్యాలను ఆలయం వారు అందించారు. ఈ సందర్భంగా శత సహస్ర కలాశాభిషేకాల్ని వేద పండితులు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు, కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



తాడిగడపలో విద్యార్థులతో నిర్వాహకులు

పెనమలూరు: తాడిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు శుక్రవారం ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా పారిశ్రామికవేత్త సాగి కృష్ణంరాజు సహకారంతో పాఠశాలలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.1.90 లక్షల ఉపకార వేతనాలు అందజేశారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఈ మేరకు చెక్కులను విద్యార్థులకు అందచేశారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన మణికంఠ, పి.అభిరామ్‌లకు రూ.25 వేలు చొప్పున, టి.నిషిత, బి.కీర్తన, వి.యశస్విని లకు రూ.10 వేల చొప్పున, మిగతా ఏడుగురికి రూ.2,500 చొప్పున ఉపకర వేతనాలు అందచేశారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన ప్రతి విద్యార్థికి రూ.వెయ్యి చొప్పున నగదు అందజేశారు. హెచ్ఎం కనకదుర్గ, నాయకులు తుమ్మల రామ్‌కుమార్, నర్రాచంటి, విఠల్, మున్వర్, ఎస్ఎంసీ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



జీరో ఫేర్ టికెట్‌ను మహిళకు అందజేస్తున్న ఎమ్మెల్యే

పామర్రు(మొవ్వ): కూటమి ప్రభుత్వం స్త్రీ శక్తి పథకాన్ని అమలు చేసిందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆర్టీసీ బస్టాండ్‌లో స్త్రీ శక్తి పథకాన్ని మహిళకు ఆధార్ కార్డు ద్వారా జీరో ఫేర్ టికెట్ ఇచ్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఈ పథకాన్ని ప్రారంభించి మహిళల గౌరవాన్ని మరింత పెంచినట్లు తెలిపారు.

పైపులైన్ల లీకులు సరి చేయండి

మోపర్రు(పెదపారుపూడి): మండలంలోని మోపర్రు ట్యాంక్ బజార్‌లో రెండు చోట్ల లీకులు పడి తాగునీరు వృథాగా పోతున్న సిబ్బంది పట్టించుకోవటం లేదని గ్రామానికి చెందిన శివయ్య అంటున్నారు. పంచాయతీ కార్యదర్శి పుల్లయ్యకు పలుమార్లు చెప్పినా స్పందించటం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

150 మందికి వైద్య పరీక్షలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రభుత్వ ఆస్పత్రి విశ్రాంత ప్రొఫెసర్, ప్రముఖ నేత్ర వైద్యుడు కోలా విజయశేఖర్ పేర్కొన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా భవానీపురం బ్యాంక్ సెంటర్‌లోని ఆల్‌మైటీ నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కోలా హాస్పిటల్స్ వైద్య బృందం 150 మందికి దృష్టి దోషం, బ్లడ్ షుగర్, ఆక్సిజన్ సాచురేషన్, బ్లడ్ ప్రెజర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు.